కథ

**వాణిశ్రీ**

# బెడిసికొట్టిన ప్లాన్

ఆ నలుగురూ రూమ్ చేరేటప్పటికి రాత్రి పది దాటింది. మంగళగిరి నుంచి పానకాలు, ఒంగోలు నుంచి సింగయ్య, బాపట్ల నుంచి భావనారాయణ, నల్లగొండ నుంచి యాదగిరి ఏ ఉద్యోగమూ రావడానికి ఆస్కారం లేని టెన్త్ గట్టెక్కలేక బతకడానికి సిటీ చేరుకున్నారు. నదులన్నీ సముద్రానికి చేరతాయన్నట్లుగా చిన్న చిన్న పనులు చేసేవారికి సముద్రంలాంటి పారిశ్రామిక వాడ పటాన్‌చెరువులో కలుసుకుని స్నేహితులయ్యారు.

మురికివాడలో రేకుల షెడ్డుకి ఐదొందలు ఇచ్చి తల దాచుకున్నారు. పగలంతా చచ్చేట్టు చాకిరి. రాత్రి రూమ్‌కి వచ్చేటప్పటికి పది అవుతుంది. తెల్లవారుతూనే మళ్ళీ పరుగు.

కొన్నాళ్ళ తర్వాత యాదగిరి "అన్నా! నావల్లకాదే గీ పనులు. ఆటో తోలుకుంటా" అని పని మానేశాడు.

యాదగిరి ఆటో తోలడం మొదలు పెట్టాక వాడి వేషం తొందరగా మారిపోయింది. జీన్‌ప్యాంట్లు, రంగు రంగుల డిజైన్ షర్టులు వేయసాగాడు. చేతికి వాచీ కాళ్ళకి షూష్ కూడా వచ్చాయ్.

పానకాలు బిర్యానీ సెంటర్లో పనిచేస్తాడు. రాత్రి ఇంటికి వచ్చేటప్పుడు మిగిలిపోయిన బిర్యానీ, చికెన్ ముక్కలు పట్టుకొస్తాడు. పొట్లాం తెరవగానే వచ్చే మసాలా వాసనకి గదంతా ఘుమఘుమలాడిపోతుంది. నోట్లో నీళ్ళూరతాయి. మందుంటే ఆ మజాయే వేరు. అదే కోరిక పుడుతుంది. మందుకి సరిపోను డబ్బులుండవు. మురికివాడ సెంటర్లో కిరాణా కొట్టు పెట్టుకున్న పోచవ్వ దగ్గరికి పరిగెత్తుతారు. ఆమె వడ్డీకి డబ్బులిస్తుంది. తొంభై రూపాయలు చేతిలో పెడుతుంది. రోజుకి పది రూపాయల చొప్పున పది రోజులపాటు క్రమం తప్పకుండా ఇవ్వాలి. ఏ రోజు ఇవ్వకపోయినా ఇంటికొచ్చి బండ బూతులు తిడుతుంది.

"మనకి రోజూ ఇంత మందు, కాసిని చికెన్ ముక్కలు వుంటే బాగుండురా!" అన్నాడు భావనారాయణ ఒకరోజు మందుపార్టీలో.

"ఏడనుంచొస్తది బై. దినం గడవడం కష్టంగుంటే" అన్నాడు యాదగిరి.

"పెళ్ళయ్యేదాకే మనకీ మందు, చికెను ముక్కలు. పెళ్ళయిందా అంతా దరిద్రమే" అన్నాడు పానకాలు.

సింగయ్య పక పక నవ్వాడు.

"ఎందుకు అంత నవ్వొస్తుంది నీకు?" అన్నాడు పానకాలు.

"నవ్వక ఏడవమంటావా? మనకెవడ్రా పిల్లనిచ్చేది? ఏవుంది? ఒక వుద్యోగమా? ఇల్లా? వాకిలా?" అన్నాడు సింగయ్య.

సింగయ్య చెప్పిందాంట్లో నిజం గ్రహించారు ముగ్గురూ. అందుకే ఎవరూ మాట్లాడలేదు.

"చిన్న చిన్న పనులు చేసినంత కాలం ఇంతే. మనకు పొట్టగడవడమే కష్టం. ఇల్లు, వాకిలీ ఎక్కడ సంపాదిస్తాం?" సింగయ్యే అన్నాడు.

"మనకి ఇదైనా వుంది. ఇది లేక అడుక్కునేవాళ్ళు బోలెడుమంది వున్నారు"

"సర్లే! తిండి కోసమే ఐతే మనూళ్ళో ఎట్టాగొట్టా దొరకదా? బాగుపడదామనేగా సిటీకొచ్చింది"

"బతకడానికి"

"ఎక్కడైనా బతకొచ్చు ఈమాత్రం"

"ఐతే బాగుపడ్డం ఎట్టా?"

"ఏదైనా బిజినెస్ చెయ్యాలి" అన్నాడు సింగయ్య.

సింగయ్య మాటలకు అంతా పక పకా నవ్వారు.

"ఎందుకురా నవ్వుతారు?"

"బిజినెస్ చేద్దామంటే నవ్వొచ్చింది"

"బిజినెస్ అంటే కోట్లు పెట్టుబడి పెట్టి చేసే పెద్ద షాపింగ్ మాలే కాదురా! ఏదైనా కాలనీలో కూరగాయల కొట్టో, చిన్న టిఫిన్ సెంటరో చాలు మన లెవల్‌కి" అన్నాడు సింగయ్య.

"దానికైనా డబ్బు కావాలిగా?"

"అదే మరి" అన్నాడు సింగయ్య.

"డబ్బులు వూరకే వస్తాయా? దొంగతనమన్నా చెయ్యాలి. లేకపోతే ఏ పిల్లాడినన్నా కిడ్నాపైనా చెయ్యాలి" అన్నాడు పానకాలు.

"శభాష్. బై. మన ఆటోలో ఎత్తుకెళ్ళి పైసలియ్యమని ఫోన్ కొడదాం. చచ్చుకుని ఇస్తారు" అన్నాడు యాదగిరి.

"ముందు పైసలున్న బకరాగాన్ని చూడు" అన్నాడు సింగయ్య.

అంతా పక పక నవ్వారు.

ooo

కొన్ని రోజుల తర్వాత యాదగిరి చెప్పాడు.

"అన్నా! మియాపూర్‌లో రవీంద్రని ఒకడు మస్తు పైసలు సంపాయిచ్చిండు. ఆనికొక కొడుకున్నాడు. ఆ పోరడికి రెండేళ్ళు. మాటలు సరిగా రావు. పదేళ్ళపోరి ఆడిని పార్కులో ఆడిపిత్తది. అందులో లైట్లుండయ్యి. చీకటి గుంటది. ఆడిపిచ్చే పోరి పోరడ్ని వదిలి జారు బండ ఆడతది. ఆడ్ని కిడ్నాపే జెయ్యడం ఈజీ అన్నా!"

సింగయ్య కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డాడు. తర్వాత కళ్ళు తెరిచాడు.

"కిడ్నాప్ చెయ్యడం ఎట్లాగో చెయ్యొచ్చు. కాని డబ్బు గుంజడమే కష్టం. దానికేదైనా ప్లాన్ వెయ్యాల" అన్నాడు.

"అదేదో నువ్వే వెయ్యి. మనలో నువ్వే బుర్రున్నోడివి" అన్నాడు పానకాలు.

ఇక సక్సెస్‌ఫుల్ ఐడియాల కోసం సింగయ్య డిటెక్టివ్ పత్రికలు చదవడం, టీవీలో నేరాలు-ఘోరాలు, క్రైం టైమ్ వంటివి చూడ్డం మొదలుపెట్టాడు.

సింగయ్య తనకొచ్చిన ఐడియా అందరికీ చెప్పాడు. అట్లాగైతే పోలీసులకు దొరక్కుండా తప్పించుకోవచ్చని అందరికీ నమ్మకం కుదిరింది. కిడ్నాప్ చెయ్యడానికి ముహూర్తం పెట్టారు.

ఆ రోజు చీకటి పడింది. మియాపూర్ చౌరస్తా నుంచి బొల్లారం పోయే రోడ్డులో ఎడమ పక్కగా వుంది బి.కె.కాలని. యాదగిరి పార్కు గేటుకి కొంచెం దూరంలో ఆటో ఆపాడు. పార్కులో పిల్లలు జారుడు బండమీద ఆడుకుంటున్నారు. రవీంద్ర కొడుకు బంటీ ఒక క్రోటన్ మొక్క దగ్గర నిలబడి ఆకులు తెంచుతున్నాడు. బంటీని ఆడిస్తానికి తీసుకొచ్చిన దేవకి జారుడు బండ ఆడుతోంది.

యాదగిరి తనతోపాటు వచ్చిన భావనారాయణని, పానకాలుని ఆటోలోనే కూర్చోమని చెప్పి తను పార్కులోకి ప్రవేశించాడు. పార్కులో పెద్దగా జనం లేరు. లాన్‌లో అక్కడక్కడ జంటలు కూర్చుని స్వీట్ నథింగ్స్ చెప్పుకుంటూ చుట్టూవున్న ప్రపంచాన్ని మర్చిపోయారు. సిమెంట్ బెంచీలమీద కొందరు ముసలివాళ్ళు రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. ఒకాయన వైయస్‌ని తీవ్రంగా కోప్పడుతుంటే, మరొకాయన చంద్రబాబుని విమర్శిస్తున్నాడు.

యాదగిరి తనను ఎవరూ గమనించడం లేదని నిర్ధయించుకున్నాక జేబులో నుంచి ఫైవ్‌స్టార్ చాక్లెట్ తీసి బంటీకి చూపించాడు. బంటీ పరిగెత్తుకొచ్చాడు. యాదగిరి బంటీని ఎత్తుకుని ముద్దుపెట్టుకుని వాడి చేతికి ఫైవ్‌స్టార్ చాక్లెట్ అందించాడు. మెరుపులా పార్కులోనుంచి మాయమై ఆటో దగ్గరికి వెళ్ళి వాళ్ళకు బంటీని అందించాడు. ఆటో స్టార్టు చేశాడు. పానకాలు, భావనారాయణల మధ్య బంటీని కూర్చోబెట్టుకుని చాక్లెట్ తినిపించసాగారు.

ఆటో రయ్‌న మెయిన్ రోడ్ వైపు దూసుకుపోయింది.

ooo

పార్కులో ఆడుకుంటున్న పిల్లలు ఒక్కొక్కరే ఇళ్ళకు

వెళ్ళిపోయారు. దేవకి మిగిలింది. బంటీ కోసం చుట్టూ చూసింది. ఎక్కడా కనిపించలేదు. పార్కు అంతా గాలించింది.

"బంటీ! బంటీ" అని కేకలు పెట్టింది.

రోడ్డుమీదకు వెళ్ళి "బంటీ..బంటీ" అని అరుస్తూ తిరిగింది. పిచ్చిపిచ్చిగా పరిగెత్తింది. దేవకి, గుండె దడ దడ కొట్టుకుంటోంది. బంటీ ఎక్కడా కనిపించలేదు. 'బంటీ' అని కలవరిస్తూ తిరిగింది. చివరకు దానికి ఏడుపు తన్నుకొచ్చింది. వెక్కెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

దేవకి బంటీని తీసుకుని ఇంకా ఇంటికి రాకపోవడంతో తనే పార్కు దగ్గరికి బయల్దేరింది. రవీంద్రభార్య విద్య. ఆమెకు ఎదురైంది ఏడుస్తున్న దేవకి. విద్య మనసు ఏదో కీడుని సూచించి భయపడింది.

"ఏమైందే? బంటీ ఏడీ?" అడిగింది విద్య.

"కన్పడత లేదమ్మా" ఏడుస్తూనే చెప్పింది దేవకి.

"కన్పించడం లేదా? మొద్దుమొఖందాకా! వాడిని వదిలిపెట్టి నువ్వేం చేస్తున్నావే? ఎక్కడ చచ్చావు? పార్కులో సరిగ్గా చూశావా? నిద్రొచ్చి ఏ చెట్టుచాటునైనా పడుకున్నాడేమో?" అని దేవకిని పట్టుకుని పార్కులోకి ఈడ్చుకెళ్ళింది విద్య.

కాసేపటిలో విద్య కొడుకు బంటీ కన్పించడం లేదని కాలనీలో చాలామందికి తెలిసింది. అంతా వెతకసాగారు. బంటీ ఎక్కడా లేడు.


విద్యలో ఆందోళన ఎక్కువైంది. భయంతో వణికిపోతోంది. భర్తకి ఫోన్ చేసి విషయం చెప్పింది. అరగంటలో రవీంద్ర ఇంటికి వచ్చాడు. ఆ ఇంట్లో విషాదం నెలకొంది. విద్య ఏడుస్తోంది. ఏడ్చి ఏడ్చి అలసిపోయింది దేవకి. దేవకికి పన్నెండేళ్ళుంటాయి. పనీపాటలు చేస్తుందని, పిల్లాడిని ఆడిస్తుందనీ తమ పూరు నుంచి తెచ్చుకుంది విద్య.

ఇరుగుపొరువాళ్ళు పోలీసులకు రిపోర్టు ఇవ్వమన్నారు. కొందరు అప్పుడే తొందరపడొద్దని సలహా ఇచ్చారు. రవీంద్ర కొద్దికాలంలోనే రియల్ ఎస్టేట్‌లో డబ్బు సంపాదించి ఇండిపెండెంట్ ఇల్లు కట్టాడు. అతని దగ్గర డబ్బుందని తెలిసిన వాళ్ళు అతని కొడుకుని కిడ్నాప్ చేసి వుండొచ్చు. ఏదైనా ఫోన్ వస్తుందేమో ఆగమన్నారు.

ఎంతకీ ఫోన్ రాలేదు. బంటీని ఎవరైనా కిడ్నాప్ చేశారా? లేక తప్పిపోయాడా? అర్థం కావడం లేదు.

రవీంద్ర భార్య అజాగ్రత్తగా వుందని విసుక్కున్నాడు. కాని సంవత్సరం నుంచీ బంటీని ఎత్తుకెళ్ళి పార్కులో ఆడిస్తూ ఇంటి తీసుకొస్తున్నది దేవకి. ఎప్పుడూ పొరపాటు జరగలేదు. ఇప్పుడే జరిగింది. దేవకి బంటీని ఒంటరిగా వదిలి తను పిల్లల్తో ఆడుకుంటున్నప్పుడు ఎవరో కిడ్నాప్ చేసివుంటారని రవీంద్రకి అనుమానంగానే వుంది.

రాత్రి పదిగంటల వరకు చూశాడు రవీంద్ర. కిడ్నాపర్లు ఫోన్ చేస్తారేమో? తనకి ఇబ్బంది లేనంత డబ్బు



అడిగితే వాళ్ళ మొఖాన కొట్టి బంటీని వదిలించుకోవడానికి మానసికంగా సిద్ధం అయ్యాడు. కానీ ఫోన్ రాలేదు. మరి బంటీని ఎవరు తీసుకెళ్ళినట్లు? డబ్బు కోసమైతే ఫోన్ రావాలి. ఇక లాభం లేదని రవీంద్ర బంటీ ఫోటో తీసుకుని పోలీస్ స్టేషన్‌కి బయల్దేరాడు.

○○○

మర్నాడు పేపర్లలో బంటీ కిడ్నాప్ అయిన వార్త ప్రముఖంగా పడింది. మియాపూర్ బి.కె.కాలనీలో బంటీ కిడ్నాపైన ఇంటికి టీవీ ఛానెల్స్ వాళ్ళు చేరుకున్నారు. దేవకిని మాట్లాడించారు. తనకేం తెలియదని చెప్పి ఏడ్చింది. ఇందులో దేవకి అజాగ్రత్త తప్ప నేరం ఏమీ వుండదని విద్య చెప్పింది. ఆ పిల్లని తమ వూరు నుంచీ తెచ్చుకుని ఇంట్లో పెట్టుకుందనీ, నమ్మకమైందేననీ చెప్పింది. అదంతా టీవీ ఛానెల్స్‌లో ప్రసారం చేశారు.

బంటీ కిడ్నాపై ఇరవై నాలుగు గంటలు గడిచినా జాడ తెలియలేదు. కిడ్నాపర్ల నుంచి ఫోన్ రాలేదు. మరి బంటీని ఎందుకు? ఎవరు కిడ్నాప్ చేశారో పోలీసులకు అర్థం కాలేదు. రవీంద్రను అతని శత్రువుల గురించి ఎంక్వయిరీ చేశారు. రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో శత్రువులంటూ వుంటారు. కాని తన కుటుంబం మీద కక్ష గట్టేంత కసి ఎవరికీ వున్నట్లు తోచలేదు. ఆ మాటే పోలీసులకు చెప్పాడు.

పోలీసులు రవీంద్ర ఫోన్ల మీద నిఘా వుంచారు. రెండు రోజులు గడిచినా ఎవరూ ఫోన్ చెయ్యలేదు. రవీంద్ర దిగులు పడిపోయాడు. అతని భార్య విద్య ఏడుపునకు అంతూ పొంతూ లేదు. కన్న కడుపు మరి. రవీంద్ర అత్తమామలు, తల్లిదండ్రులు విషయం తెలిసి ఇంటికి వచ్చారు. వాళ్ళని ఓదారుస్తున్నారు.

యాదగిరి మామూలుగా రవీంద్ర ఇంటి ముందుకొచ్చి హారన్ మోగించాడు. రవీంద్ర కూతురు గీత యాదగిరి ఆటోలోనే స్కూలుకి వెళ్ళివస్తుంది. గీత తమ్ముడు బంటీ కనిపించడం లేదనీ, అందుకే గీతని స్కూలుకు తయారు చేయలేదనీ, ఇంట్లో అంతా విచారంలో మునిగివున్నారని తెలుసుకుని బాధ నటించాడు.

“నిన్న, మొన్న స్కూలుకి సెలవుసాబ్. గిటువైపు రాలే. నాకీ సంగతి ఎరికలే. బద్మాష్ కొడుకులు ఎవలెత్తి కెళ్ళిండ్రో!” అన్నాడు రవీంద్రతో.

ఇంతలో రవీంద్ర సెల్ రింగైంది.

“హలో రవీంద్రగారేనా?”

“ఔను మీరెవరు?”

“నా పేరు వెంకన్న. నెల్లూరి నుండి మాట్లాడుతుండా! ఇయ్యాల పేపర్లో మీ యాడ్, మీ బంటీ ఫోటో చూశా!”

“మా బంటీని ఎక్కడైనా చూశారా? మీకు కనిపించాడా?” ఆశగా అడిగాడు రవీంద్ర.

“నాకు జ్యోతిష్యం తెలుసు. మీ బంటీ పుట్టినరోజు, సమయం చెప్తే, ఎక్కడున్నాడో చెప్పగలను” అన్నాడు సింగయ్య.

“తప్పకుండా. లైనులో వుండండి” అని రవీంద్ర, డైరీలో నోట్ చేసిన బంటీ పుట్టిన రోజు సమయం చెప్పాడు.

“మళ్ళీ గంట తర్వాత ఫోన్ చేస్తాను. మీ బంటీ తప్పకుండా దొరుకుతాడు. దొరికితే నాకు బహుమతి ఇవ్వాలి”

“తప్పకుండా! మీకు లక్ష రూపాయలు ఇస్తాను” అన్నాడు రవీంద్ర ఉద్వేగంతో.

“ఆ మాట మీద వుండండి” అని ఫోన్ కట్ చేశాడు సింగయ్య.

రవీంద్ర పోలీసులకు ఫోన్ చేసి తనకు వచ్చిన ఫోన్ నెంబర్ చెప్పాడు. ఆ నెంబర్ కోడ్‌ని బట్టి నెల్లూరు నుంచే వచ్చినట్లు పోలీసులు కన్ఫర్మ్ చేశారు. ఫోన్ చేసిన వ్యక్తి నిజంగా జ్యోతిష్కుడై వుండొచ్చు అనుకున్నారు.

గంట తర్వాత సింగయ్య ఫోన్ చేశాడు.

“రవీంద్రగారూ! మీ బంటీ ఇంట్లో కాకుండా నాలుగు గోడల మధ్య వున్నాడు. మీ ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలో వున్నాడు. అక్కడ ఒక స్మశానం కూడా వుంది. ఆ చుట్టుపక్కల చుట్టూ కాంపౌండ్ వాల్ వున్న ఖాళీ ప్లాట్లలో వెతకండి. కనిపిస్తాడు. మళ్ళీ తర్వాత ఎప్పుడైనా ఫోన్ చేస్తాను” అన్నాడు.

## శ్రీదేవి రీఎంట్రీ?

నిన్నటి గ్లామరస్ శ్రీదేవి రీఎంట్రీ గురించి కొంత కాలంగా వినిపిస్తోంది. ఇటీవల ఆమె ఓ తమిళ చిత్రం హక్కుల్ని కొనమని తన భర్త బోనీకపూర్‌ని కోరిందిట. ఓ సంగీతకారుడికీ-ఓ చెవిటి, మూగ అమ్మాయికీ మధ్య సాగే అనుబంధం ఇతివృత్తంగాగల ఈ సినిమా ద్వారా శ్రీదేవి తెరపైకి రీఎంట్రీ కావాలని భావిస్తున్నట్టుగా చెబుతున్నారు. ఎందుకంటే నటనకు ఎక్కువగా అవకాశం వుండే పాత్ర గనక శ్రీదేవి తన సత్తా ఏంటో మరోసారి నిరూపించుకోవడానికి అవకాశం వుంటుంది కదా!



ఆ ప్రాంతమంతా రవీంద్రకు కొట్టిన పిండే. మియాపూర్ నుంచి లింగంపల్లి వెళ్ళే రోడ్డులో రెండు మైళ్ళ తర్వాత ఎడమ పక్క పాత మున్సిపాల్టీ ఆఫీసు ఎదురుగా రోడ్డు గుర్తుకొచ్చింది. ఆ రోడ్డులో కొంత దూరం వెళ్తే అక్కడ స్మశానం వుంది. అక్కడ పొలాలున్నాయి. ఈమధ్య ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. రవీంద్రకు అదంతా గుర్తొచ్చింది.

తన స్నేహితుల్ని నలుగురిని తీసుకుని ఆ ప్రాంతానికి వెళ్ళాడు రవీంద్ర. అక్కడ రోడ్డు ప్రక్కన ఖాళీ స్థలంలో బంటీ చిన్న సైకిల్ మీద కూర్చుని కాళ్ళతో ముందుకు పోతూ కనిపించాడు. రవీంద్ర ఆశ్చర్యానికి అంతు లేదు.

“బంటీ!” అని పిలుస్తూ దగ్గరికి వెళ్ళాడు.

బంటీ నవ్వుతూ తండ్రిని చూసి నవ్వుతున్నాడు. రవీంద్ర పరిగెత్తుకెళ్ళి బంటీని ఎత్తుకుని హృదయానికి హత్తుకున్నాడు. అతని కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలాయి. కొడుకు

దొరికినందుకు ఎంతో ఆనందం కలిగింది.

రవీంద్ర స్నేహితులు కొంచెం దూరంలో అక్కడక్కడా వున్న ఇళ్ళకు వెళ్ళి బంటీ గురించి వాకబు చేశాడు. ఎవరో చెప్పలేకపోయారు. ఆ పిల్లవాడు చాలా సేపటి నుంచి ఆడుకుంటున్నాడనీ, ఎవరో కుర్రాడు బిస్కెట్లు తినిపించి నీళ్ళు తాగించి పోయాడనీ ఒక ముసలమ్మ చెప్పింది. బంటీ వంటి మీద సరికొత్త డ్రెస్ వుండడం, సరికొత్త సైకిల్ మీద కూర్చోబెట్టి ఆడించడం చూసి ఎవరో వాడిని పెంచుకోవడానికి ఎత్తుకొచ్చి వుంటారని అనుకున్నారు.

○○○

బంటీ దొరికిన వారం రోజుల తర్వాతే వాడి బర్త్‌డే వచ్చింది. రవీంద్ర కొడుకు తప్పిపోయి దొరికిన ఆనందంలో వాడి బర్త్‌డేకి ఫంక్షన్ హాలు బుక్ చేసి బంధుమిత్రులందరికీ డిన్నర్ పార్టీ ఇచ్చి ఆనందించాడు.

ఆ తర్వాత వారం రోజులకు జ్యోతిష్కుడి గెటప్‌లో సింగయ్య సిల్క్‌లాల్చీ, సిల్క్‌పైజమా, ముఖాన విభూది రేఖలు పెట్టుకుని రవీంద్ర ఇంటికి వచ్చాడు.

రవీంద్ర సింగయ్యకు మర్యాద చేసి పట్టుబట్టలు పెట్టి తాంబూలంలో లక్ష రూపాయలు నగదు పెట్టి ఇచ్చాడు.

○○○

కిడ్నాప్ వ్యవహారం విజయవంతం కావడంతో సింగయ్య బ్యాచ్ మురికివాడలో రేకుల షెడ్ ఖాళీ చేశారు. చందానగర్ మెయిన్‌రోడ్డు మీద టిఫిన్ సెంటర్ దొరికితే అది అద్దెకు తీసుకున్నారు. కింద టిఫిన్ సెంటర్, పైన వుండటానికి రూమ్ వున్నాయి. నలుగురు మిత్రులూ పనులు మానేసి టిఫిన్ సెంటర్ నడప సాగారు.

ఒకరోజు రాత్రి పది గంటలకు టిఫిన్ సెంటర్ ముందు పోలీస్ వ్యాన్ ఆగింది. అప్పటికి టిఫిన్ సెంటర్ ఇంకా మాయ లేదు. నలుగురు కష్టమర్లు మాత్రమే వున్నారు. కౌంటర్లో సింగయ్య కూర్చుని వున్నాడు. గడ్డం పెంచుకుని లోగడ చూసిన వాళ్ళు గుర్తుపట్టలేనట్లు మారిపోయాడు.

హెడ్ కానిస్టేబుల్ రషీద్ సరాసరి కౌంటర్ దగ్గరికి వచ్చాడు. జేబులో వున్న కవరు బైటకు తీశాడు. అందులో వున్న ఫోటోకు కౌంటర్లో వున్న సింగయ్యకు పోల్చి చూశాడు. తృప్తిగా వూపిరి పీల్చాడు.

"నిన్ను ఇన్‌స్పెక్టర్ సాబ్ రమ్మండు" చెప్పాడు రషీద్.

సింగయ్య పక్కలో బాంబ్ పడ్డట్లు అదిరిపడ్డాడు. రషీద్ వైపు అయోమయంగా చూశాడు. గుండె వేగంగా కొట్టుకుంది. చెమటలు పట్టాయి.

"నన్నా!" అన్నాడు హీనస్వరంతో.

"నిన్నే" కఠినంగా అన్నాడు రషీద్.

ఎందుకు? ఏమిటి? అని తాత్సారం చేస్తే స్టేషన్‌కెళ్ళాక పిచ్చకొట్టుడు కొట్టే ప్రమాదం వుందని భయపడుతూ వ్యాన్ ఎక్కాడు. మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

తను ఎంతో ఆలోచించి కిడ్నాప్ డ్రామా ఆడాడు. విజయవంతంగా డబ్బు రాబట్టాడు. ఇక సెటిలై పోయినట్లే అని భ్రమ పడ్డాడు. టిఫిన్ సెంటర్ బాగానే నడుస్తోంది. మరి పోలీసులకు తాము బంటీని కిడ్నాప్ చేసినట్లు ఎలా కనిపెట్టి వుంటారు? తను ఎక్కడ తప్పు చేశాడు? ఎక్కడ దొరికిపోయాడు?

నేరం గిట్టుబాటు కాదని ఎవరో చెప్పిన మాట నిజమేనా?

పోలీస్ స్టేషన్ ముందు జీప్ ఆగింది.

సింగయ్యని చూస్తూనే ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"రండి వెంకన్న స్వాములూ! కూర్చోండి"

ఇన్‌స్పెక్టర్ కుర్చీ ఆఫర్ చేశాడు. సింగయ్య మొహమాటపడుతూనే కూర్చున్నాడు.

"రవీంద్ర కొడుకు కిడ్నాప్ కేసులో మీరు జ్యోతిష్యం చెప్పి మాకు చాలా శ్రమ తగ్గించారు. మీకు సన్మానం చేయాలనుకున్నాం. దేనికైనా సమయం సందర్భం రావాలి గదా!" అని నవ్వాడు ఇన్‌స్పెక్టర్.

సింగయ్య గుండె గుభేలుమంది. సన్మానం అంటే

## అంతా 'మనీ' మహిమ!

డబ్బుంటే చాలు ఏదయినా సాధించవచ్చు అనేది చాలా సందర్భాలలో రుజువవుతూనే వుంది. '16 డేస్' చిత్రంలో అరవింద్ అనే కొత్త కుర్రాడికి జంటగా నటిస్తున్న ఛార్మి ఈ సినిమాలో ఓ కిస్సింగ్ సీన్‌ని చేయమంటే ముందు చేయనని భీష్మించుకు కూర్చుందిట. ఆనక నిర్మాతలు ఈ సీన్ కోసం మరో రెండు లక్షలు ఎక్కువ ఇస్తాం అని ఒప్పుకోగానే ఛార్మి కూడా 'సరే'నని ఆ సీన్ చేసిందని ఫిలిం నగర్‌లో వార్త చక్కర్లు కొడుతోందిప్పుడు. మనీయా మజాకా!



అది ఏ రకమైన సన్మానమో అర్థం కాలేదు. పోలీసు సన్మానం అన్నాడంటే అందులో ఏదో నిగూఢార్థం వున్నట్లు తోచింది. ఏం చెప్పాలో తోచక వెర్రి నవ్వొకటి నవ్వాడు.

ఇన్‌స్పెక్టర్ డ్రాయర్ సొరుగులో నుంచి పదహారేళ్ళ యువతి ఫోటో తీసి సింగయ్యని అందించాడు.

"ఈ అమ్మాయి పేరు జోగులాంబ. నిన్న సాయంకాలం చందానగర్‌లో ఎవరో కిడ్నాప్ చేశారు. ఆమె పుట్టిన రోజు, సమయం, నక్షత్రం వగైరా ఫోటో వెనుక రాసి వున్నాయి. ఇప్పుడా జోగులాంబ ఎక్కడున్నదో మీ జ్యోతిష్యం ద్వారా చెప్పాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

సింగయ్య ఆ ఫోటో వైపు, ఇనస్పెక్టర్ ముఖం వైపు మార్చి మార్చి చూశాడు. తర్వాత అతనికి చెమట్లు పట్టాయి.

కట్ చేస్తే పోలీస్ స్టేషన్ ఇంటరాగేషన్ రూమ్. అక్కడ సింగయ్య బ్యాచ్ మొత్తానికి పోలీస్ కానిస్టేబుల్స్ సన్మాన కార్యక్రమం జరుపుతున్నారు.

○